
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 27 ఆగస్టు 2024





సచివాలయాలు అస్తవ్యస్తం!

- గాడి తప్పిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ
- సమయ పాలన పాటించని ఉద్యోగులు
- అందరూ ఒక్కటై డుమ్మా కొడుతున్న వైనం
- ఉదయం 10.30లోపు సగం కూడా లేని హాజరు
- విధులు, బాధ్యతలు లేని విధానంతో ఇష్టారాజ్యం
- పర్యవేక్షణ లేని చోట్ల మరింత దారుణంగా పరిస్థితి
- తనిఖీల్లో షాకుకు గురవుతున్న ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఇటీవల తన నియోజకవర్గం పరిధిలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఒకరిద్దరు తప్ప మిగిలిన ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. ఇలా ఒక సచివాలయం కాదు.. మూడు డివిజన్లలోని సచివాలయాల్లో అదే పరిస్థితి ఆమెకు ఎదురయింది. ఒక్కో డివిజన్ పరిధిలో 50 మంది ఉద్యోగులు వుంటారని, వారెవరూ తమకు అందుబాటులో వుండడం లేదని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆమె వెంటనే ఉద్యోగులను పిలిపించి తీవ్ర హెచ్చరికలు చేశారు.

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలంలోని సచివాలయాలను పరిశీలించడానికి వెళ్లిన ఒక అధికారి షాక్‌కు గురయ్యారు. తనిఖీకి వెళ్లిన అధికారికి సచివాలయంలో ఉద్యోగులు ఎవరూ కనిపించలేదు. పైపెచ్చు ఆ సచివాలయంలో కుక్కలు పడుకుని వున్నాయి. దీంతో ఆగ్రహానికి గురైన సదరు అధికారి ఉద్యోగులను పిలిచి మందలించారు. - ఇవి ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒకటి రెండు ఘటనలు మాత్ర మే. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో ఇదే పరిస్థితి అన్ని చోట్లా కనిపిస్తోంది.

పల్నాడు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఆ జిల్లాలో మాచర్ల, వినుకొండ, గురజాల మండలా ల్లోని సచివాలయాల్లో ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతు న్నారు. ఆయా నియోజకవర్గాల్లో నమోదయ్యే ఉద్యోగుల హాజరులో ఉదయం పదిన్నరలోపు నమో దయ్యే హాజరు సగానికంటే తక్కువగా ఉంటోంది. బాపట్ల జిల్లాలో రేపల్లె నియో జకవర్గంలోని తీరప్రాంత గ్రామాల్లో, చీరాల డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఉద్యోగులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు.

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన నుంచి సచివాలయ వ్యవస్థపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. గ్రామ స్వరాజ్యాన్ని దెబ్బతీసే వ్యవస్థగా, చేతికి వుండే నిరర్థకమైన 'ఆరో వేలు'గా విమర్శలు ఎదుర్కొంటున్న ఆ వ్యవస్థ కాలం గడిచే కొద్దీ మరింత దిగజారిపోతూ వుంది. ప్రజలకు అందుబాటులో వుండాలని లక్షల మంది ఉద్యోగులను నియమించి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో వుండడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటోంది. సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు సగం మంది కూడా సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, ప్రజలకు అందుబాటులో వుండకపోవడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బయటకు కనిపించని ఎన్నో అంశాలు, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. సచివాలయాల తనిఖీలకు వెళ్లిన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు షాకుల మీద షాకులు తగులు తున్నాయి. ఉద్యోగులు హాజరు కావడం లేదని, తమకు అందుబాటులో వుండడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో అందుతున్నాయి.

ఒక అవగాహనతో వ్యవహారం

గ్రామ సచివాలయాల్లో మారు మూల ప్రాంతాల్లో వుండే సచివాలయాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. సచివాలయ బాధ్యతలు నిర్వర్తించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కొందరు తోటి ఉద్యోగులతో ఒక అవగాహనకు వచ్చి విధులకు డుమ్మా కొడుతున్నారు. తమ వద్ద నున్న డివైజుల ద్వారా హాజరు నమోదు చేసి ఆఫీసుకు రాకుండానే చెక్కేస్తున్నారు. అధికారులు ఎవరైనా వచ్చినప్పుడు ఫీల్డ్ విజిట్లో వున్నట్లు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీడీవో, ఎండీవోలు తనిఖీలు చేయడానికి వీలుగా లేని సచివాలయాల్లో పరిస్థితి ఆందోళనకర స్థాయిలో వుంది. కాగా వార్డు సచివాలయాల్లో పరిస్థితి మరింత దారుణంగా వుంది. నగరాలు, పట్టణాల్లో వున్నా అక్కడ విధులకు డుమ్మా కొట్టేస్తున్నారు. నగరం, పట్టణంలో వుండే సచివాలయాలన్నిం టిపైనా అజమాయిషీ కమిషనర్‌దే కావ డంతో పర్యవేక్షణ లోపాలు తలెత్తు తున్నాయి. దీనిని ఆసరా చేసు కుని ఉద్యోగులు విధులకు ఎగ నామం పెడుతున్న పరి స్థితి కనిపి స్తోంది.

నిరుపయోగంగా బయోమెట్రిక్ విధానం



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని గత ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతి రోజూ స్పందన కార్యక్రమానికి హాజరు కావాలనే పేరుతో కొన్నాళ్లపాటు మూడు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కొన్నాళ్లపాటు ఉద్యోగులు నిరంతరం సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో వున్నారు. కానీ బయోమెట్రిక్ విధానంతో సంబంధం లేకుండా మూడు పూటలా హాజరు వున్నవారికి, లేని వారికి ఒకే విధంగా గత ప్రభుత్వం వేతనాలు ఇవ్వడంతో ఉద్యోగులు అసలు విషయం గ్రహించారు. వేతన బిల్లులు సమర్పించే సమయంలో బయోమెట్రిక్ హాజరు కాకుండా, మాన్యువల్‌గా ఇచ్చే హాజరునే ప్రామాణికంగా తీసుకోవడంతో వేతనాలకు, బయోమెట్రిక్ హాజరుకు సంబంధం లేదని గ్రహించి ఉద్యోగులు మెల్లమెల్లగా హాజరుకు డుమ్మా కొట్టడం మొదలుపెట్టారు.. కానీ గత ప్రభుత్వం దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బయోమెట్రిక్ విధానం పూర్తిగా నిరర్థకంగా మారిపోయింది. రోజులో ఏదో ఒక సమయంలో బయోమెట్రిక్ హాజరు పడితే అదే హాజరుగా పరిగణించి మ్యాన్యువల్ హాజరు పట్టిలో నమోదు చేసి చక్కగా వేతనాలు పొందుతున్నారు.

విధులు, బాధ్యతలు లేని విధానమే కారణం


గత ప్రభుత్వం హడావుడిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఉద్యోగుల విధులు, బాధ్యతలు ఏమిటనేది నిర్ణయించి నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకుండా వారిని ఉద్యోగ బాధ్యతల్లో నియమించింది. దీంతో ఉద్యోగాల్లో చేరిన వారికి ఏం చేయాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. మీ సేవ ద్వారా అందించే సేవలు అందించే పని కేటాయించారు. దాదాపు 543 రకాల సేవలు అందించాలని గత ప్రభుత్వం సూచించినా అవి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఉద్యోగులు కేవలం నాలుగైదు సంక్షేమ పథకాల బాధ్యతలకు మాత్రమే పరిమితమైపోయారు. వాటికి కూడా వలంటీర్లను నియమించడంతో, వారిపై అజమాయిషీ చేయడమే తమ విధి అనుకునే పరిస్థితికి ఉద్యోగులు గురయ్యారు. సంస్థాగతంగా నిర్దిష్టమైన జాబ్ చార్టు లేకపోవడంతో లక్షలాది మంది ఉద్యోగుల సేవలు వృధా అయిపోయాయి. ప్రస్తుతం 543 రకాల సేవలకు గానూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, 1బీ అడంగల్, పాసు పుస్తకాల జారీ సేవలు వంటి నాలుగైదు సేవలు మాత్రమే అందుబాటులో వున్నాయి. దీంతో ఉద్యోగులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకుని ఉద్యోగులు మొత్తంగా విధులకు డుమ్మా కొడుతున్నారు.



మాతృశాఖ పేరుతో డుమ్మా!



సచివాలయ వ్యవస్థలో మొత్తం 12 శాఖలకు చెందిన ఉద్యోగులు వుంటారు. గ్రామ కార్యదర్శి, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మినహా మిగిలిన ఉద్యోగులంతా వివిధ శాఖలతో సమన్వయ బాధ్యతలు నిర్వర్తించాల్సి వుంటుంది. వెల్ఫేర్ అసిస్టెంటు సాంఘిక సంక్షేమ శాఖకు, వీఆర్వో, సర్వే అసిస్టెంటు రెవెన్యూ శాఖకు, అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టికల్చర్ అసిస్టెంటు ఉద్యోగులు వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన శాఖ, మహిళా పోలీసులు హోమ్ శాఖతో అనుబంధంలో వుంటారు. ఇలా ఉద్యోగులంతా ఆయా శాఖలతో అనుబంధంలో వుండడంతో మాతృశాఖల అధికా రులు వారిని తమ అవసరాలకోసం వాడుకోవడం ప్రారంభించారు. ఫలితంగా గడి చిన ఐదేళ్లలో చాలా మంది ఉద్యోగులు సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సేవ కు లుగా మారిపోయారు. దాన్ని అడ్డం పెట్టుకుని ఏకంగా సచివాలయ విధులకే డు మ్మా కొట్టే పరిస్థితి ఏర్పడింది. ఇలా గడిచిన ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థ అనేక రకాలుగా దెబ్బతినిపోయింది. ఫలితంగా ఉద్యోగులు తమ బాధ్యతలకు దూరంగా మిగిలిపోయారు. దీనిని తక్షణం సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. లేకుంటే ఇది నిరర్థకమైన ఆరోవేలుగా మిగిలిపోయే ప్రమాదం వుంది.



ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

పల్నాడు జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శుభమంగళ హారతి, తర్వాత శుభ దర్శన హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. నరసరావు పేట ఇస్కాన్ దేవాలయంలోని రాధా గోవిందులను ప్రత్యేకంగా అలంకరించారు. పలు పట్టణాల్లో విద్యార్థులకు రంగోలి, కోలాటం, ఉట్టికొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. - నరసరావుపేట టౌన్



అనధికార లేఅవుట్లపై.. కొరడా

పల్నాడు జిల్లాలో అక్రమ వెంచర్లను పల్నాడు అర్బన్ డలవలప్‌మెంట్ అథార్టీ(పుడా) గుర్తించింది. అనధికారిక లేఅవుట్లపై కొరడా ఝుళిపిస్తోంది. లేఅవుట్ల యజ మానులకు నోటీసులు జారీ చేసింది. ప్రజలు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో, ఆయా వెంచర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరిస్తోంది. కనీస మౌలిక వసతుల కూడా కల్పించే పరిస్థితి ఉండదని పుడా స్పష్టం చేయడంతో వీటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా వైసీపీ హయాంలో ఈ అక్రమ వెంచర్ల నుంచి మామూళ్ళు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి అధికారంలోకి రావడంతో, వెంచర్లకు నోటీసులు ఇవ్వడంతో, మామూళ్ళు ఇచ్చిన రియల్టర్లకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొంత మంది అయితే మామూళ్ళు తిరిగి రాబట్టుకోవడం గమనార్హం.

- చర్యలు చేపట్టిన పుడా
- వెంచర్ల వద్ద బోర్డులు ఏర్పాటు
- జిల్లాలో 55 అక్రమ లేఅవుట్ల గుర్తింపు
- గత ప్రభుత్వ హయాంలో అనధికార వసూళ్ళు
- కూటమి అధికారంలోకి రావడంతో నోటీసులు
- మామూళ్ళు ఇచ్చిన వారిలో అయోమయం
- రూ. 35 లక్షలు తిరిగి వసూలు చేసిన ఒక రియల్టర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) జిల్లాలో అనధికార లేఅవుట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఎలాంటి వసతులు కల్పించకుండా.. అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎక్కువగా వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. కొందరు సాగు నీటి కాలువలను ఆక్రమించి మరీ స్థలాలు విక్రయిస్తున్నారు. లేఅవుట్లు వేసి ప్లాట్లుగా మార్చేందుకు ముందుగానే పుడా అనుమతులు తప్పనిసరి. అయితే కొందరు అక్రమార్కులు ఇవేవి పట్టించుకోవడంలేదు. స్థిరాస్తి వ్యాపారుల ప్రచారానికి ఆకర్షితులవుతున్న కొనుగోలుదారులు నష్టపోతున్నారు. నివాస స్థలాలకు డిమాండ్ పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, పుడా జిల్లాలో 55 అక్రమ లేఅవుట్ లను గుర్తించింది. పుడా ఏర్పాటు అనంతరం ఏర్పా టు చేసిన లేఅవుట్లకే నోటీసులు జారీ చేశారు. నరస రావుపేట మండలం లో 17 అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. చిలకలూరి పేట మండలంలో ఆరు, పిడుగురాళ్లలో 12, దుర్గిలో ఐదు, వినుకొండలో ఐదు, నాదెండ్లలో రెండు, క్రోసూరు, దాచేపల్లి, మాచర్ల, సత్తెనపల్లి, యడ్లపాడు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున అక్రమ లేఅవుట్‌లు ఉన్నట్టు పుడా ప్రకటించంది.

నిషేదిత భూముల్లో వెంచర్లు

నరసరావుపేట లింగంగుంట్ల అగ్రహారం భూములకు రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిషేదించింది, ఈ పొలాల్లో కూడా రియల్ వెంచర్లు వెలిశాయి. ఈ స్థలాల క్రయ, విక్రయాలు అన్ని అగ్రిమెంట్‌ల పైనే జరుగుతున్నాయి. తమ భూములను ఎవరు విక్రయించినా, కొనుగోలు చేసినా చెల్లవని పుష్పగిరి పీఠం స్పష్టం చేసింది. అయినా ఇక్కడ ప్లాట్‌ల విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి.

కాలువలు కనుమరుగు..

కొందరు రియల్టర్లు కాలువలు కబ్జా చేసి లేఅవుట్‌లు వేస్తున్నారు. నరసరావుపేట శివారు ప్రాంతంలోని అనేక కాలు వలు ఆక్రమించారు. కాలువ కట్టలను వెంచర్లకు రోడ్లుగా విని యోగించుకుంటున్నారు. కాలువ కట్టలను వెంచర్లలో కలిపేసుకున్నారు. వాగులను వదలడం లేదు. లింగంగుంట్ల వద్ద వాగును ఆక్రమించి వెంచర్లు వేశారు. కాలువల కబ్జాపై కూడా పుడా దృష్టి సారించాలి.



సత్తెనపల్లి పరిధిలోని ఓ వెంచర్‌లో హద్దు రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

రూ 3 కోట్లు దండుకున్నారు..

పుడా ఏర్పాటు చేశాక వెలసిన రియల్ వెంచర్లను గుర్తించారు. పుడా అనుమతులు లేని లేఅవుట్‌లను గుర్తించి సంస్థ గత ప్రభుత్వ హయాంలో నోటీసులు జారీ చేశారు. కొన్ని చోట్ల లేఅవుట్ల హద్దు రాళ్లను తొలగిం చారు. నానా హడావుడి చేసినా పుడా అధికారులు లేఅవుట్ల యజమానులతో బేరసాలు చేశారనే విమర్శలు ఉన్నా యి. 205 ఎకరాల్లో వేసిన ప్లాట్లకు సంబంధించి పుడా అధికారులు వ్యాపారలకు మధ్య ఓ డీల్ కుదిరింది. ఎకరాకు 1.50 లక్షలు చెల్లించాలని కొందరు అధికారులు డిమాండ్ చేశారు. లేకుంటే వెంచర్ల మీద చర్యలు తీసుకుంటామని బెదిరింపుల కు దిగారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య సద రు మొత్తం చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ఇలా రూ 3.07 కోట్ల మామూళ్లు దండుకున్నారు. ఈ మొత్తాన్ని వాటాలుగా పంచుకు న్నట్టు ఆరోపణలున్నాయి. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుంది తమను ఆపేదెవరు అన్న రీతిలో పుడా అక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో అక్రమ వసూళ్లు వెలుగులోకి వచ్చా యి. ఒక వెంచర్‌కు సంబంధించి రూ. 35 లక్షలు చెల్లించిన వారు, అధికారి ముక్కు పిండి మరీ ఆ మొత్తాన్ని వెనక్కు తీసుకున్నారు. ఆ అధికారి ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లారు. అనధికారిక లేఅవుట్‌లకు మామూళ్లు చెల్లించిన వారికి కూడా తిరిగి నోటీసులు అందడంతో వారు కంగుతింటున్నారు. పుడాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరగుతున్నాయి. వీటికి ప్రభు త్వం చెక్ పెడితేనే రియల్ అక్రమాలు, అనధికారిక నిర్మాణాలు నిలిచే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఇలా..

లేఅవుట్ల ఏర్పాటులో నిబంధనలు పాటించడం లేదు. 30 అడుగుల రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు, వేసిన లేఅవుట్‌లో 10 శాతం సామాజిక అవసరాలకు కేటాయించాలి. వీటిని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. ఇవి కనీసం అమలు చేయాల్సిన నిబంధనలు. ఇవేవి అమలు జరగక పోయినా, అధికారులు మాముళ్ళు దండుకొని మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి. వెంచర్లు వేస్తున్న వారు గోడలు నిర్మిస్తున్నారు. ఇది చట్ట వ్యతిరేక చర్య అని తెలిసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ఇలా ప్రతి వెంచర్‌కు గోడలు నిర్మిస్తే రహదారులు ఎలా నిర్మిస్తారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అనధికార లేఅవుట్ వద్ద బోర్డు ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

సిద్ధమవుతున్న గణనాథుడు

నరసరావుపేట, ఆగస్టు 26: సంప్రదాయ ప్రకారం తొలి పూజ గణేశిడికి నిర్వహిస్తుంటాం. అందుకే వినాయక చవితి వస్తుంటే నెల రోజుల ముందే సందడి వాతావరణం ఉంటుంది. తొలుత పల్లెల్లో పుట్టమట్టిని వినియోగించి విగ్రహాలు తయారుచేసేవారు. మట్టితో ఊరంతా సరిపోయే విధంగా చిన్నచిన్న ప్రతిమలను పంపిణీ చేసేవారు. వీధుల్లో వాడల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. రాను రాను ట్రెండ్ మారి, వీటి స్థానంలో రెడిమేడ్‌గా తయారు చేసి ఆ సమాయానికి విగ్రహాలను విక్రయిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ నుంచి వినాయక విగ్రహాల తయారీకి కళాకారులు కుటుంబాలు పల్నాడుకు వచ్చి ఇక్కడ పలు ప్రాంతాల్లో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. పాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో సైజుల వారీగా విగ్రహాలు తయారు చేయడం ప్రసిద్ధి.



సుమారు రెండు అడుగుల విగ్రహం నుంచి 20 అడుగులకు పైగా ఉంటాయి. విగ్రహాల సైజులను బట్టి అమ్మకాలు జరుగుతుంటాయి. వీటితో పాటు వినాయకుడుతో పాటు ఆయన భూజాల పై రాముడు, లక్ష్మణుడుతో పాటు శివుని చేతిలో గణనాధుడు, ఫ్రేమ్ కట్టిన వినాయకుడు ఇతర రూపాల్లో తయారు చేశారు. గత ఏడాది కంటే విగ్రహాల ధరలు పెరిగాయి. సైజును బట్టి రూ 2వేలు వరకు పెరిగాయి. ఉదాహరణకు 9 అడుగుల గణనాధుడు గత ఏడాది రూ 10 వేలుగా ఉంటే, ఈ ఏడాది రూ 13వేలు వరకు పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా డిజైన్డ్ ప్రత్యేక ఫ్రేమ్ కల్గిన గణనాధుడు ఉన్న విగ్రహాలు రూ 35వేలు వరకు ఉన్నాయి. తయారీలో ముడి సరకు పెరగడంతో గతం కంటే విగ్రహాల ధరలు పెరిగాయని నిర్వాహకులు చెబుతున్నారు.

తొమ్మిది బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



కుంకలగుంటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నకరికల్లు, ఆగస్టు 26: కుంకలగుంటలో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం అర్ధరాత్రి సమయంలో నకరికల్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంకలగుంటలో రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారని స్థానికులు కొందరు పోలీసులకు తెలిపారు. కొనుగోలు చేసి ఒక ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ ఇంటికి చేరుకొని అక్కడ ఉన్న తొమ్మిది బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించటాన్ని నివారించేందుకు ఆకస్మిక దాడులు, కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నారు. కాగా అక్రమార్జనకు అలవాటు పడ్డ రేషన్ మాఫియా మాత్రం ఇవేమి పట్టవన్నట్టుగా గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తూనే ఉన్నారు.

జేసీబీలు.. ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసుల స్వాధీనంలో జేసీబీలు

అచ్చంపేట ఆగస్టు 26: మండలంలోని కొత్తపల్లి ఇసుక ర్యాంపులో అక్రమంగా ఇసుకను ఎత్తుతున్న రెండు జేసీబీలు, రెండు ట్రాక్టర్‌లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకట ప్రసాదు తెలిపారు. కొత్తపల్లి ఇసుక రీచ్‌లో గత 4, 5రోజులుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వీటిని స్వాధీనం చేసుకుని అచ్చంపేట స్టేషన్‌కు తరలించారు. ఇది ఇలా ఉండగా అంబడిపూడి, కస్తాల, తాడువాయి నుంచి కూడా రాత్రిపూట ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. వీటిపై కూడా పోలీసులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని కూలీ మృతి

ఈపూరు, ఆగస్టు 26: ఉపాధి కోసం వచ్చిన కూలీ మృతి చెందాడు. టిప్పర్ ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కొండ్రముట్ల సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎన్నెస్పీ కాలువ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌కు కంకరను తీసుకువచ్చిన టిప్పర్ వెనక్కి వచ్చే సమయంలో అక్కడే ఉన్న ఓటేరు శ్రీను(42)ను ఢీకొట్టడంతో నేలపై పడిపోయాడు. పైనుంచి వాహనం టైర్లు వెళ్లడంతో శ్రీను శరీరం ఛిద్రమై మృతి చెందాడు. బొల్లాపల్లి మండలం షోలాయిపాలెంకు చెందిన శ్రీను కూలి పనుల నిమిత్తం వినుకొండలోని మసీదు మాన్యంలో ఉంటున్నాడు. కూలి పని కోసం వెంచర్ వద్దకు తెలిసిన వ్యక్తి ద్వారా వచ్చాడు. వాచ్‌మెన్‌గా పని కుదుర్చుకున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు, తల్లి ఉన్నారు. శ్రీను తల్లి పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీటీ శాఖలో బదిలీలకు పచ్చజెండా

- మార్గదర్శకాల జారీతో పలువురికి స్థాన చలనాలు
- కొత్తగా ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలంటోన్న ఉద్యోగ సంఘాల నాయకులు



గుంటూరులోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం

గుంటూరు, ఆగస్టు 26: ఉద్యోగుల బదిలీలకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపటంతో వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల కసరత్తు ప్రారంభమైంది. వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తూ జీవో నంబరు 170 విడుదల చేసింది. తద్వారా అర్హులైన ఉద్యోగులు, అధికారులు బదిలీలు కానున్నారు. ఈ నెల 31 లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు-1 డివిజన్ జాయింట్ కమిషనర్ మధుబాబు జోనల్ నోడల్ జేసీగా కూడా వ్యవహరించనున్నారు. నూతనంగా ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పైబడి సర్వీసు పూర్తి చేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీకి అర్హులుగా తెలిపారు. పాలనా సౌలభ్యం కోసం ఐదేళ్ల సర్వీసు లేకపోయినా కొన్ని బదిలీలు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో కాకుండా అన్ని కార్యాలయాల్లో బదిలీ చేసేలా సమతూకం పాటించాలని సూచించారు. వితంతు, మహిళలు, విభిన్న ప్రతిభావంతులకు, భార్యభర్తలకు సౌకర్యంగా ఉండలా బదిలీ చేయాలని అనేక సడలింపులను కూడా ప్రకటించారు. గతేడాది జరిగిన సంస్కరణల్లో భాగంగా బయటి ప్రాంతాలకు వెళ్లిన వారిలో సీనియర్లను ఇక్కడ ఏర్పడిన ఖాళీలను బట్టి తీసుకురావచ్చని కూడా సూచించారు. ఉద్యోగ సంఘం నాయకులుకు గతంలో మాదిరిగానే ఒకే స్టేషన్‌లో 9 ఏళ్ల లోపు ఉంచాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు, కొందరు అధికారుల అనాలోచిత విధానాలతో సంస్కరణల పేరుతో (ఆర్‌వో) రీజనల్ కార్యాలయాలు తీసుకొచ్చారన్న విమర్శలు ఉన్నాయి. 2022-23లో సిటీ శాఖలో సంస్కరణల్లో భాగంగా నూతనంగా విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాల్లో ఆర్‌వో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దాంతో అనేక మంది ఏసీటీవో, క్లరికల్ కేడర్ వారు బయటి ప్రాంతాల ఆర్‌వో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు ఎవరినీ వెనక్కి తీసుకొచ్చే పరిస్థితి కూడా లేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోన్-3లో ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలి

గత ప్రభుత్వం సంస్కరణల పేరుతో రాష్ట్రంలో నాలుగు జోన్‌లుండగా మూడు ఆర్‌వో కార్యాలయాలను మాత్రమే ఏర్పాటు చేసింది. దాంతో ఉద్యోగులు ఇక్కడ నుంచి దూర ప్రాంతాలైన తిరుపతి, వైజాగ్‌కు కూడా బదిలీలపై వెళ్లాల్సి వచ్చిందని చెబుతున్నారు. పైగా గతంలో ఎటువంటి మార్గదర్శకాలు పాటించకుండా ఉద్యోగులను బలవంతంగా బదిలీలు చేశారన్న విమర్శలు కూడా ఉద్యోగ సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. జోన్-3 పరిధిలోని గుంటూరు-1, పల్నాడు డివిజన్, ఒంగోలు, నెల్లూరు డివిజన్‌ల పరిధిలో నూతన ఆర్‌వో కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అర్హులపై కసరత్తు

గుంటూరు జోన్ పరిధిలో గుంటూరు-1, పల్నాడు డివిజన్, నెల్లూరు, ఒంగోలు డివిజన్‌ల పరిధిలో బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాపై నోడల్ జేసీ మధుబాబు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా జోన్ పరిధిలో ఏసీటీవోలు 19 మంది, సీనియర్ అసిస్టెంట్‌లు 36, జూనియర్ అసిస్టెంట్‌లు 21 మంది బదిలీలకు అర్హులుగా జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సారైనా బదిలీల్లో ఉన్నతాధికారుల మార్గదర్శకాలు పక్కాగా పాటించటంతో పాటు ఎటువంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా బదిలీల నుంచి మినహాయింపు కోసం కొందరు ఉద్యోగులు యూనియన్‌ల నుంచి నకిలీ ధ్రువపత్రాల కోసం అమ్యామ్యాలు ముట్టచెబుతున్నట్టుగా ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది.

క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ల బదిలీల్లో ప్రతిష్టంభన



గుంటూరు జిల్లా పరిషత్ ఆవరణలో బదిలీల కోసం వచ్చిన పీఆర్ ఇంజనీర్లు

గుంటూరు సిటీ, ఆగస్టు 26: జోన్-3 పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్, ఎష్యూరెన్స్ ఇంజనీర్ల బదిలీల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. క్వాలిటీ కంట్రోల్, ఎష్యూరెన్స్ విభాగంలో బదిలీ కోసం వచ్చిన డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు అందరూ అసోసియేషన్ లేఖలతో రావటంతో పీఆర్ చీఫ్ ఇంజనీర్ బిత్తరపోయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇక్కడ తేలేది కాదన్న ఆలోచనతో ఫైల్‌ని ఈఎన్‌సీకి పంపిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. సోమవారం గుంటూరు జిల్లా పరిషత్ ఆవరణలోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో జోన్-3 పరిధిలోని సిబ్బంది బదిలీల ప్రక్రియ చేపట్టారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకున్న డీఈఈ, ఏఈఈ, జేఈ ఇతర పరిపాలన సిబ్బంది ఉదయం 10 గంటలకే జడ్పీ ఆవరణకు చేరుకున్నారు. బదిలీ ప్రక్రియను చేపట్టేందుకు వచ్చిన పీఆర్ చీఫ్ ఇంజనీర్ సీవీ సుబ్బారెడ్డి, గుంటూరు ఎస్ఈ యర్రం బ్రహ్మయ్య ఒక్కొక్కరి అర్హతలను పరిశీలించారు. సాధారణ అర్హతలు ఉన్న ఉద్యోగుల బదిలీలను ఆమోదించారు. క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ల వ్యవహారంలో చాలా మంది డీఈఈ, ఏఈఈలు అసోసియేషన్‌లో ఉన్నట్లు లేఖలు తీసుకురావటంతో ఏ నిర్ణయం తీసుకోలేదు. సుమారు 15 మంది ఈఎన్‌సీకి అసోసియేషన్ లేఖలు చూపించినట్లు తెలిసింది. వారి బదిలీలకు సంబంధించిన ఫైల్‌ను ఈఎన్‌సీకి సమర్పిస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఇంతమంది డీఈఈ, ఏఈఈలు అసోసియేషన్ లేఖలు తీసుకురావటం మొదటిసారని పలువురు వ్యాఖ్యానించారు.

కుంకలగుంటలో అర్చకుని ఇంట్లో చోరీ

- రూ.1.30 లక్షల నగదు, ఆభరణాల అపహరణ



అర్చకుని ఇంటిలో పగలగొట్టిన బీరువా

నకరికల్లు, ఆగస్టు 26: మండలంలోని కుంకలగుంటలో అర్చకుడు కంజర్ల వేణుగోపాలచార్యులు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 23న తన సోదరుని కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడు గ్రామానికి వేణుగోపాలచార్యులు వెళ్లాడు. సోమవారం ఉదయం అర్చకునికి ప్రసాదం ఇచ్చేందుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వేణుగోపాలచార్యులు ఇంటికి వెళ్లాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆ వ్యక్తి వెంటనే అర్చకుని సమాచారం ఇచ్చాడు. దీంతో వేణుగోపాలచార్యులు ఇంటికి వచ్చి చూడగా ఇంటి బయట తాళాలు, ఇంట్లో తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బీరువాలు పగులగొట్టి వస్తువులన్నీ చిందర వందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.1.30 లక్షల నగదు, రెండు బంగారు ఉంగరాలు, నాలుగు జతల కాళ్ల పట్టీలు, రెండు వెండి కుందులు, రెండు వెండి లాకెట్‌లు, పది గ్రాముల వెండి నాణెం, వెండి గిన్నె అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వీటి విలువ సుమారుగా రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అర్చకుని ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఇంటికి సమీపంలో ఒక ఎరువుల దుకాణానికి సీసీ కెమెరా ఉంది. అందులోని సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. ముగ్గురు యువకులు రాత్రి 1 గంట సమయంలో సంచరించినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల విద్యార్థినుల వసతి గృహాలపై పర్యవేక్షణ శూన్యం

- వార్డెన్లు ఎప్పుడు వస్తారో తెలియని దుస్థితి
- విద్యార్థినుల చేత వెట్టిచాకిరి
- అటకెక్కిన అధికారుల తనిఖీలు



రాజాగారితోటలోని విద్యార్థినుల హాస్టల్ సముదాయం

గుంటూరు(విద్య),ఆగస్టు 26: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలనే ఆశతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కళాశాల హాస్టల్స్‌లో చేర్పిస్తున్నారు. అయితే విద్యార్థినులకు భద్రత అక్కడ డొల్ల అనే విషయం తెలిసి వారికి కంటి మీద కునుకు ఉండటం లేదు. ఇటీవల ఇంటర్ చదివే విద్యార్థినులకు ఇద్దరు యువకులు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశారు. వారిని రాజీవ్ గృహకల్ప గదుల్లో నిర్బంధించి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించగా, తల్లిదండ్రుల్ని కలవరపాటుకు గురి చేసింది. విద్యార్థిల్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన హాస్టల్ వార్డెన్లు కొన్నిచోట్ల విద్యార్థినులతో పనులు చేయిస్తూ వారి భద్రతను రోడ్డుమీదకు నెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు హాస్టళ్ల గదులు ఊడ్చడం, వంట కోసం కూరగాయాల్ని తరగడం, బయట నుంచి కూరగాయలు, పాలు, పెరుగు తీసుకురావడం వంటి పనులకు విద్యార్థినుల్ని ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కనిపించని కమిటీలు..

ఉమ్మడి జిల్లాలో కళాశాల స్థాయి విద్యార్థినుల కోసం నియోజకవర్గాల వారీగా హాస్టళ్లు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో ఎస్సీ, ఎస్టీబీసీ, మైనార్టీ విద్యార్థినులు వసతి పొందుతూ ఇంటర్ నుంచి పీజీ స్థాయి ఒక్కో హాస్టల్‌లో సగటున 100 మంది వసతి పొందే అవకాశం ఉంది. ఒక్కో హాస్టల్ నిర్వహణ కోసం ప్రభుత్వం విద్యార్థినికి రూ. 400 నుంచి 500 వరుకు చెల్లిస్తుంది. విద్యార్థినులు ఒక కమిటీగా కళాశాల హాస్టళ్లు నిర్వహించుకోవాలి. అయితే ఇది ఎక్కడా కనిపించదు. హాస్టల్ నిర్వహణ అంతా వార్డెన్ల కనుసన్నల్లోనే సాగుతుంది. హాస్టల్‌ను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా మహిళా వార్డెన్లు ఏర్పాటు చేశారు. అయితే వారు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

- అరండల్‌పేటలో బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఓ అద్దె భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నారు. అక్కడ వార్డెన్ విద్యార్థినుల చేత కూరగాయలు తరగడం, వంట పాత్రలు శుభ్రం చేయించడం, గదుల్ని శుభ్రం చేయించడం చేస్తున్నారని అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల తాము చదివే కళాశాల అధ్యాపకులు తమ చేత మరుగుదొడ్లు కడిగిస్తున్నారని చెప్పి బోరున సదరు విద్యార్థినులు విలపించారు.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మరో హాస్టల్‌లోనూ విద్యార్థినుల చేత ఉదయం, సాయంత్రం పరిసరాలు శుభ్రం చేయించడం చేయిస్తున్నారు. వంట మనిషి లేకుంటే తామే వంటలో కూడా సాయం చేయాల్సిన వస్తుందని విద్యార్థినులు వాపోతున్నారు.
- జ్యూట్‌మిల్లు పక్కనే(చంద్రమౌళీశ్వరపురం) ఉన్న హాస్టల్‌లో కూడా విద్యార్థినుల చేత పని చేయిస్తున్నారు. విద్యార్థినులు పెరుగు, కూరగాయల కోసం బయటకు వెళ్లిన సమయంలోనే వారిని ఏమార్చి కిడ్నాప్ చేసిన విషయం పోలీసుల దర్యాప్తులో బహిర్గతం అయిన విషయం తెలిసిందే. ఇక్కడ పనిచేసే వార్డెన్ విధుల్ని సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- రవీంద్రనగర్‌లో ఉన్న మైనార్టీ విద్యార్థినుల హాస్టల్‌లో కూడా భద్రత లేదనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే చోట హాస్టల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకునే అకాశం కూడ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.
- రాజాగారితోటలోని విద్యార్థినుల హాస్టల్ నుంచి యథేచ్ఛగా నిత్యావసర సరకులు తరలిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పని చేసే సిబ్బంది వంట సామగ్రిని మిగుల్చుకుని వార్డెన్ లేని సమయంలో తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పర్యవేక్షణ అంతంత మాత్రమేననే వాదన ఉంది.
- కళాశాల హాస్టళ్ల పర్యవేక్షణను అధికారులు దాదాపు పట్టించుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యార్థినుల భద్రత, వారి సమస్యలపై దృష్టిపెట్టి సమీక్షించిన దాఖలాలు లేవు.
- కొన్నిచోట్ల రెండు, మూడు హాస్టళ్లను ఒకే వార్డెన్ పర్యవేక్షించాల్సి వస్తుంది. దీంతో మొత్తంగా వారు విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రతి రోజూ తెల్లవారు జామున వచ్చి అల్పాహారం, భోజనం పర్యవేక్షించాలి. మళ్లీ సాయంత్రం 4 గంటలకు వచ్చి రాత్రి 8.30 వరకు ఉండాలి. అయితే ఇలా విధులు నిర్వర్తించే వార్డెన్లను వేళ్ల మీద లెక్కించవచ్చునని అధికారులే చెబుతున్నారు.
- కళాశాల హాస్టళ్లు అన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. యజమానులకు అద్దెలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారు నిర్వహణను గాలికి వదిలేదస్తున్నారు. కనీసం విద్యుత్, నీటి సమస్యలు కూడా పరిష్కరించడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఏ కోర్సులో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్



రవి తేజ

పొన్నూరుటౌన్, ఆగస్టు 26: కంపెనీ సెక్రటరీ కోర్సులో జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్‌ను పొన్నూరుకు చెందిన చందు రవి తేజ సాధించాడు. కంపెనీ సెక్రటరీ కోర్సులో రెండు దశలు ఉండగా మొదటి దశ సీఎస్ ఎగ్జిక్యూటివ్, రెండో దశ సీఎస్ ప్రొఫెషనల్. సీఎస్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో ఫలితాలను ఆగస్టు 25న ప్రకటించారు. దేశంలో ప్రకటించిన 16 ర్యాంక్‌ల్లో చందు రవితేజకు 11వ ర్యాంక్ వచ్చింది. 16 ర్యాంక్‌ల్లో 14 మంది ఉత్తర భారతదేశానికి చెందిన వారు కాగా రవి తేజ ఏపీకి చెందిన వ్యక్తిగా నిలిచారు. గతంలో సీఎంఏ ఇంటర్‌లో ఆల్ ఇండియా 31వ ర్యాంక్‌ను సాధించారు. చిన్నతనం నుంచి కూచిపూడి నృత్యంలో రాణించిన రవితేజ కంపెనీ సెక్రటరీ కోర్సులో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించడంపై పొన్నూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

143 జీవోను వెంటనే రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఆగస్టు 26: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఇబ్బంది కలిగించే 143 జీవోను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వలన వచ్చిన 143 జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మండల వ్యవస్థను కనుమరుగు చేయాలన్న దురాలోచనతో జగన్ ప్రభుత్వం చట్టబద్ధత లేని సచివాలయ వ్యవస్థను తెచ్చి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుందన్నారు. 143 జీవో వలన వచ్చిన రీడిపార్ట్‌మెంట్ వలన రెండేళ్లుగా ఉద్యోగులు ఒక చోట ఉద్యోగం చేస్తూ మరో చోట జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం సత్వరమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఇద్దరు బాలురుపై పోక్సో కేసు నమోదు


తాడికొండ, ఆగస్టు 26: తనను ప్రేమించకపోతే రేప్ చేస్తానని బెదిరించిన బాలుడు, బాలికపై తన స్నేహితుడితో కలిసి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలుర్లపై తాడికొండ పోలీసులు పోక్స్ యాక్ట్ కింద కేసును సోమవారం రాత్రి నమోదు చేశారు. సీఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన ఓ బాలిక తల్లి, అన్నతో నివాసం ఉంటూ స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21 తేదీన బాలికకు అనారోగ్యంగా ఉండటంతో స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. అయితే అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలుర్లు బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడ్డారు. బాలిక నిద్ర పోవటాన్ని గమనించి బాలిక నోరు మూసి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాలిక పెద్దగా కేకలు వేయటంతో ఇంటిపైన నివాసం ఉంటున్న ఓ మహిళ కిందకు రావటంతో ఇద్దరు బాలుర్లు పారిపోయారు. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లి, అన్నకు చెప్పలేదు. కాగా బాలికకు భయంతో జ్వరం వచ్చింది. దీంతో తల్లికి జరిగిన విషయాన్ని చెప్పింది. స్కూల్‌కి వెళ్లే సమయంలో తన వెంటపడి ప్రేమించక పోతే రేప్ చేస్తానని బెదిరించేవాడని తెలిపింది. తన కూమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలుర్పై తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పొన్నూరుటౌన్, ఆగస్టు26: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పొన్నూరు పట్టణానికి చెందిన వంట మేస్త్రి టి.జయ ఈ నెల 23న గుంటూరు గాంధీ పార్క్ వద్ద ఓ వ్యక్తిని వంట పని కోసం మాట్లాడుకుని పొన్నూరు తీసుకొచ్చారు. ఈ నెల 24న సాయంత్రం వంట పనిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి సమీపంలోని డ్రైనేజి కాల్వలో పడిపోయాడు. సదరు వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతుడి వివరాలు తెలియకపోవటంతో చేతి మీద ఉన్న పచ్చబొట్ల ఆధారంగా మృతుడిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14,600 క్యూసెక్కుల నీరు విడుదల

- డెల్టా కాలువలకు 16,538 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 26: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 31,138 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు ఎత్తి దిగువకు 14,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16,538 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 26: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,104 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,503 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,503 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట ఆగస్టు 26: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ తెలిపారు. ఎగువ నుంచి 32,760 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 33,623 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందని తెలిపారు.

1.0541 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 26: నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0541 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన మూడు గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 24 వేలు, టేల్‌రేస్ ఛానల్ ద్వారా 8875 మొత్తంగా 32875 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 26: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 7508 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 330 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1889, తూర్పు కాల్వకు 692, పశ్చిమకాల్వకు 220, నిజాంపట్నం కాల్వకు 400, కొమ్మమూరు కాల్వకు 3280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పల్నాడు వార్తలు


తాళ్లపల్లిలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

యాదవులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

- శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్
- వివిధ ప్రాంతాల్లో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు

మాచర్ల రూరల్, ఆగస్టు 26: యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆకాంక్షించారు. మండలంలోని విజయపురిసౌత్, కొప్పునూరు, తాళ్లపల్లి, మాచర్ల పట్టణంలో సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలన్నారు. రానున్న రోజుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముఖ్యమంత్రిగా రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఉన్నత విద్యావంతులను చేయాలని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. ఏ పార్టీలో ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. విజయపురిసౌత్‌లోని శ్రీరుక్మిణిసమేత శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఉట్టి కొట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో గుండాల శ్రీనివాస్ యాదవ్, రాజభోయిన మధుయాదవ్, నేరేటి వీరాస్వామి యాదవ్, ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు (జీవీ), కొరకూటి అంజనేయులు, వస్తపురి శ్రీరామ్మూర్తి, రిటైర్డ్ డిప్యూటి ఈవో గాదె రామకృష్ణారావు, పేర్ల కొండలు, బీఎస్పీ నేత గుండాల సైదులు, గుమ్మడి నాసరయ్య, వెంకట్రామయ్య, మున్నా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: రాజకీయ పార్టీలకు అతీతంగా యాదవులు కలిసిమెలిసి ఐక్యతతో ముందుకు సాగాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ అన్నారు. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా దుర్గిలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీ కృష్ణ జన్మాష్టమిని యాదవులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. తాను ఎక్కడి వెళ్లినా యాదవులు తనను కుటుంబసభ్యునిగా ఆదరిస్తున్నారన్నారు. అనంతరం రామచంద్రాయాదవ్‌ను యాదవ సంఘీయులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, యెల్లెబోయిన గోపాల్, జక్కా బాజి, గై గోపాల్ (లైన్‌మాన్), కుర్రా సాంబశివరావు, దాదిన బోయిన మణికంఠ, యెనిగండ్ల నవీన్, షేక్ బాజీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.


శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో శ్రీరామకృష్ణాగురుకులం చిన్నారులు

రెంటచింతల: శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆలయంలో, ఉట్లస్తంభాల సెంటర్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. శ్రీరామకృష్ణా గురుకులంకు చెందిన చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషదారణలో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, కమిటి సభ్యుడు రాచమడుగు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు.

మాచవరం : మండలంలోని మాచవరం, వేమవరం, గంగిరెడ్డిపాలెం, గోవిందాపురం గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన మాచవరంలో ఎస్ఐ సతీష్ వేడుకల్లో పాల్గొన్నారు. గంగిరెడ్డిపాలెం, వేమవరం గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో కృష్ణుడి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

దాచేపల్లి: దాచేపల్లిలోని రంగనాయకుల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా తంగెడ గ్రామంలోని శ్రీకృష్ణాలయంలోనూ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాచేపల్లిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో, త్రైత్రసిద్ధాంతంవారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభోత్సవానికి హాజరైన గ్రామస్థులు, వేదపండితులు

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

దాచేపల్లి, ఆగస్టు 26: తంగెడ గ్రామంలోని 11వ శతాబ్దం నాటి చరిత్ర కలిగిన భవనాశినిదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా సోమవారం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ ప్రారంభంగా గణపతి పూజ, పుణ్యాహ వాచనం, గోపూజ, శాలార్చన అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పురోహితులు జానపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఘణాపాటి చీమలపాటి ఫణిపవన్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమాలను ప్రారంభించారు. 101 గుడి, 101 బావులు చరిత్ర కలిగిన తంగెడ గ్రామంలో ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పండుగ పూట కరెంటు కోత

పిడుగురాళ్ల, ఆగస్టు 26: పల్నాడు ప్రాంతంలో సోమవారం విద్యుత్ కోతలతో కృష్ణాష్టమి భక్తులకు నిరాశ ఎదురైంది. ఉదయం 10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా సాయంత్రం 5 గంటలకు తిరిగి పునరుద్ధరణ కావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ కోత వుండటంతో చిన్నారులు పగటిపూట ఉక్కపోతకు గురయ్యారు. ఆసుపత్రుల్లో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఇన్వర్టర్, జనరేటర్ సౌకర్యం వున్నప్పటికీ ఎక్కువ సమయం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించే పలు దేవాలయ ప్రాంతాల్లో భక్తులకు అసౌకర్యం ఏర్పడింది.

ప్రాణ వాయువుకి ప్రాణం లేదు !

ఆస్పత్రిలో రోగి అత్యవసర పరిస్థితిలో ప్రాణవాయువు (ఆక్సిజన్) అవసరం తెలియంది కాదు. వెంటిలేటర్‌పై రోగి ఆయువుని నిలబెట్టేది ఆక్సిజన్ మాత్రమే. అలాంటిది సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఆక్సిజన్‌ను అందించే ప్లాంట్ మూలనపడి ఉంది. ఎన్నో లక్షల విలువ చేసే ఆ పరికరం నిరుపయోగంగా మారింది. కేవలం ఒకటి.. అర సిలిండర్లతోనే కాలం వెల్లదీస్తున్నారు. దీంతో ఒక్కో సందర్భంలో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులను ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం లేని కారణంగానే ప్రైవేటు ఆస్పత్రులకో.. గుంటూరు జీజీహెచ్‌కో ఇక్కడి వైద్యులు తరలిస్తున్నారు.

- ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్లు
- లక్షల వ్యయంతో ఏర్పాటుచేసి నేడు మూలన పెట్టారు
- సిలిండర్లతోనే నెట్టుకొస్తున్న ఆస్పత్రి అధికారులు
- వెంటిలేటర్ల పనితీరు అంతంత మాత్రమే..


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగావున్న ఆక్సిజన్ ప్లాంటు

సత్తెనపల్లి, ఆగస్టు 26 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఆవరణలో 2022 కరోనా నేపథ్యంలో రెండు ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. వీటిల్లో ఒక ప్లాంటు ఏర్పాటుకి ఐటీసీ సంస్థ వారు సహకరించగా, మరొక దానిని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. వాటిని అప్పుడు స్థానిక ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న అంబటి రాంబాబు ఎంతో అట్టహాసంగా ప్రారం భించారు. అయితే అనంతర కాలంలో వాటి నిర్వహణ, పర్యవేక్షణను అప్పటి ప్రభుత్వం గాలి కొదిలేసింది. క్రమేణా అసలు ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగించకుండా మూలనపెట్టేశారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.


బయటి నుంచి కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ సిలిండర్

ఆక్సిజన్ ప్లాంట వినియోగం లేకపోవడంతో ఆ ప్రభావం రోగులకు అందే చికిత్స పడుతోంది. పలు అత్యవసర సందర్భాలలో సిలిండర్లను గుంటూరు నుంచి కొనుగోలు చేసి ఆస్పత్రికి తెప్పిస్తున్నారు. ఇందుకుగాను ఆస్పత్రి అభివృద్ధి నిధులను వెచ్చిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతుంది. సుమారు ఆరు నెలలుగా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లు పూర్తిగా పని చేయటం లేదు. కనీసం మరమ్మతులు చేసి వినియోగం లోకి తీసుకు రావాలన్న ఆలోచన కూడా చేయటం లేదు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అందించే వెంటి లేటర్లు కూడా వైద్యశాలలో మూలన చేరాయి. వాటికి మరమ్మతులు చేయిస్తే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఆస్పత్రిలో ఐదుకు పైగా వెంటి లేటర్లు మూలనపడి ఉన్నాయి. ఆక్సిజన్ ప్లాంట్ల మరమ్మతులు, వెంటిలీటర్ల నిర్వాహణతో పాటు కార్డియాలజిస్టు వైద్యుడు, ఐసీయూ టెక్నీషయన్ లేక పోవటం కూడా సమస్యగా ఉంది. వెంటనే వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేలా కృషి చేయాలని నియోజక వర్గ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం ..

ఈ విషయంపై ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావుని ప్రశ్నించగా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లు, వెంటిలేటర్లు పని చేయటం లేదన్న విషయం వాస్తవమేనని, ఈ విషయాన్ని గతంలోనే తాము వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.


కంకణంపాటి వీరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

వీరయ్య మృతి టీడీపీకి తీరని లోటు

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఆగస్టు 26 : టీడీపీ సీనియర్ కంకణంపాటి వీరయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఇటీవల మృతిచెందిన కంకణంపాటి వీరయ్య భార్య కోటేశ్వరమ్మ, కుమారుడు హరికృష్ణ, కుటుంబ సభ్యులను సోమవారం దేచవరంలోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే కన్నా, టీడీపీ నేతలు కలసి పరామర్శించారు. వీరయ్య మృతి తనకు ఎంతో బాధ కలిగించింద కన్నా అన్నారు. అనంతరం వీరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగోతు శౌరయ్య, మొక్కపాటి రామచంద్రరావు, సాగి శ్రీను, కొంగర రవి, చిరుమామిళ్ళ నరేంద్ర భూపతి, గంగవరపు జయశంకర్, బోడపాటి హనుమంతరావు, పాలడుగు శ్రీనివాసరావు, కొనికినేని వెంకట అప్పయ్య, పెమ్మసాని వెంకటరావు, ముప్పాళ్ళ కామేశ్వరరావు, గంగవరపు వెంకట కోటేశ్వరరావు, బోడపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సహకరించండి

దుర్గి, ఆగస్టు 26: ఉపాధిహామీ పనుల్లో భాగంగా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఆర్‌పీ రాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన పనులపై ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీలు జరుగుతాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామస్థులు ఈ తనిఖీలకు సహకరించాలలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు బోల్తా

మాచర్ల రూరల్, ఆగస్టు 26: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటన మండలంలోని ఏకోనాంపేట మలుపు వద్ద జరిగింది. మాచర్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ39జడ్ 0482 నంబరు గల బస్సు హైదరాబాద్ నుంచి మాచర్లకు వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఏకోనాంపేట మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టింది. బస్సులో 11 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉపాధ్యాయ అవార్డులకు

దరఖాస్తులు చేసుకోండి

రెంటచింతల,ఆగస్టు 26 : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టెంబరు5వ తేదీ) సందర్భంగా సత్తెనపల్లి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈనెల 31వ తేదీ లోపు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ఈవో ఏసుబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంఈవో, డీవై ఈవోల ద్వారా దరఖాస్తులు కార్యాలయాలకు చేరాలన్నారు. నేరుగా పంపిన దరఖాస్తులు స్వీకరించేది లేదన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

రెంటచింతల, ఆగస్టు 26: బీఎల్వోలందరూ అక్టోబరు 18 వరకు పకడ్బందీగా ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ కరుణ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. కొత్త ఓట్ల చేర్పులు, మార్పులు, మృతుల ఓట్ల తొలగింపు, పోలింగ్ స్టేషన్ల మార్పు, వలస ఓట్లు గుర్తింపు వంటి వాటిని బీఎల్‌వోలు ఈ సర్వేలో ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

29న సీజీజీబీ శాఖ ప్రారంభం

నకరికల్లు, ఆగస్టు 26: మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో ఈ నెల 29న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) శాఖను ప్రారంభించనున్నట్లు రీజనల్ మేనేజర్ వర్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ కే.ప్రమోద్ కుమార్ రెడ్డి, జనరల్ మేనేజర్లు పీ.మారుతీరామ్, పీ.వీరారెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.


ఎండిపోయిన కొచ్చెర్ల మంగలి వారి చెరువు

చేపల కోసం చెరువును ఎండబెట్టారు

- తాగు, సాగు నీటికోసం కొచ్చెర్ల గ్రామస్థుల అవస్థలు

ఈపూరు,ఆగస్టు26: మండలంలోని కొచ్చెర్ల మంగలవారి చెరువును చేపలు పట్టుకునేందుకు వ్యాపారులు నీటిని బయటకు వదిలి ఎండబెట్టారు. గ్రామానికి తాగు, సాగునీటిని అందిస్తున్న చెరువు ఎండిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశువులకు తాగునీరు లేక సుమారు 5కి.మీ దూరంలో ఉప్పరపాలెం చెరువుకు తోలుకుపోవాల్సి వస్తుందని పశు యజమానులు అంటున్నారు. వందల ఎకరాలలో పంటలను చెరువు నీటితోనే పండిస్తుంటారు. ప్రస్తుతం చెరువులో నీరు లేకపోవడంతో వరినాట్లు వేయలేక పోతున్నామని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు తమస్వార్థంకోసం చేపల వ్యాపారులకు చెరువు నీటిని బయటకు పంపేందుకు అనుమతి ఇవ్వడం వలనే చెరువు ఎండిపోయిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగర్ కాలువ నీటితో చెరువుని నింపాలని గ్రామస్థులు కోరుచున్నారు.


పట్టణంలోని 1వ వార్డులో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు

- సత్తెనపల్లిలో ఉట్టి కొట్టే వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా
- వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించిన భక్తులు

సత్తెనపల్లి, ఆగస్టు 26 : పట్టణంలోని 1వ వార్డులో టీడీపీ నేతలు కార్యకర్తలు సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. స్థానికులతో కలసి ఉట్టికొట్టారు. ముందుగా కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి కొట్టి అందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, నూర్ బాషా జానీబాబు, పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిశుమందిర్ ఉన్నత పాఠశాల వడ్డవల్లిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యం, సిబ్బందికి శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు గోపికలు, కృష్ణుని వేషధారణలతో నృత్యాలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నాను పాఠశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లి, రాజుపాలెం, అనుపాలెం, నెమలిపురి, కొత్తూరు తదితర గ్రామాలలో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం అన్నదానం చేయటంతో పాటు ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ముప్పాళ్ళ: మండలంలోని పలుగ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. దమ్మాలపాడులోని కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చాగంటివారి పాలెంలోని జగన్నాదస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణం, విశేషపూజలు చేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో ఏయస్‌కేవి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రత్యేక పూజలు

పెదకూరపాడు, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని సోమవారం అమరావతిలోని లేమల్లె శ్రీకృష్ణుని దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌కు ఆశీర్వచనాలు అందించారు. అలాగే గుంటూరు జిల్లాలోని మోతడక గంగాపార్వతి సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు.


పల్నాడు జిల్లా ఆట్యాపాట్యా బాలికల జట్టు

ఆట్యాపాట్యా జిల్లా జూనియర్ జట్లు ఎంపిక

నకరికల్లు, ఆగస్టు 26: పల్నాడు జిల్లా జూనియర్ విభాగంలో ఆట్యాపాట్యా బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వి రోహిత్ జోయల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకరికల్లు శ్రీ వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ ఎంపికలకు 80 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చింతా పుల్లయ్య, ఝాన్సీరాణి, తిరుమల భాయి, జానకిరామయ్యలు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు సెప్టెంబరు 14, 15 తేదీలలో కర్నూల్‌లో జరుగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.


పల్నాడు జిల్లా ఆట్యాపాట్యా బాలుర జట్టు

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే మేలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) కన్నా పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు మేలు చేస్తుందని ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ టీ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్ విధానంలో ఉద్యోగులు ప్రతి నెలా జమచేసిన పెన్షన్ ఫండ్ నుంచి రిటైర్మెంట్ సమయంలో ఎంతశాతాన్ని చెల్లిస్తారో పేర్కొనకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉద్యోగి వద్ద ఎలాంటి కాంట్రిబ్యూషన్ మినహాయించకుండా పెన్షన్ విధానాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయడమే ప్రభుత్వాలకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందన్నారు.

మదర్‌థెరిసా జయంతి ఉత్సవాలు

మాచర్లటౌన్, ఆగస్టు 26: మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యాన సోమవారం పట్టణంలోని మదర్ థెరిసా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ పోలూరి నరసింహారావు ముఖ్య అతిధిగా హాజరై మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనాధలు, వృద్ధులు, కుష్టు రోగులకు మదర్‌థెరిసా సేవా సమితి ఆధ్వర్యాన చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఇన్‌చార్జి చైర్మన్‌నరసింహారావును దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్య క్రమంలో సేవాసమితి అధ్యక్షుడు గాదె కిరీటిరెడ్డి, లీగల్ అడ్వ యిజర్ చిలమకూరినాగిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, చంద్రయ్య, కసిరెడ్డి శాంతిరెడ్డి, హనుమంతురావు, ఆదినారాయణ, పాండురంగారావు, రమేష్ పాల్గొన్నారు.


మదర్‌థెరిస్సా జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ నరసింహారావు

పెదకూరపాడు: మదర్‌థెరిసా సేవలను ఆదర్శంగా తీసుకోవాలని బుచ్చయ్యపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పర్చూరి పూర్ణచంద్రరావు అన్నారు. అమరావతిలో మదర్‌థెరిసా 114వ జయంతిని జన చైతన్య సమితి ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలితోటి అనిల్‌కుమార్, షేక్ లియాఖత్ అలీ, గంజిమాల విజయ్ బాబు, గోవిందు గోవి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్‌లపై ప్రభుత్వం కొరడా

- మండలాల వారీగా వెంచర్ల గుర్తింపు
- వివరాలను ప్రజలకు వెల్లడి చేస్తున్న ప్రభుత్వం


పిడుగురాళ్ల సమీపంలో వెలసిన అనధికార లేఅవుట్

పిడుగురాళ్ల, ఆగస్టు 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా ఆ పార్టీ నేతలు ప్రభుత్వ, పోరంబోకు భూములలో సైతం అనధికార లే అవుట్‌లను వేశారు. ఇప్పుడు అలాంటి లేఅవుట్‌లపై కూటమి ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. ల్యాండ్ కన్వర్షన్, మున్సిపల్, పంచాయతీ అప్రూవల్ ఏమీ లేకుండా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా లేఅవుట్‌లు వెలిశాయి. ముఖ్యంగా అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారికి పిడుగురాళ్ల నుండి పొందుగల వరకు ఇరువైపుల ఇబ్బడిముబ్బడిగా వెంచర్లు వెలిశాయి. ఇవన్నీ గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతల కనుసన్నల్లో వెలిసినవే. ఎటువంటి అనుమతులు లేకుండానే పొలాలను ప్లాట్లుగా మార్చి జనాలకు అంటగట్టారు. ప్రభుత్వం ఇప్పుడు మండలాల వారీగా అనధికార లేఅవుట్‌లను గుర్తిస్తూ వాటి స్వభావం, యజమానులు, సంస్థల వివరాలను బహిరంగ పరుస్తూ పత్రికల్లో ప్రకటనలు జారీ చేస్తోంది. అనధికార లేఅవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దంటూ మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేస్తున్నారు.

అక్రమ లే అవుట్‌లతో ప్రభుత్వ ఖజానాకు గండి..

అక్రమ లేఅవుట్‌ల వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండిపడింది. అక్రమ లేఅవుట్‌ల వివరాలను అధికారులు యజమానుల పేర్లతో సహా ప్రచురిస్తుండటంతో వైసీపీ నేతల గుట్టు రట్టుఅవుతుంది. పిడుగురాళ్ల మొదలుకొని బ్రాహ్మణపల్లి మెడికల్ కళాశాల సమీప ప్రాంతాలలో, తుమ్మలచెరువు, వీరాపురం, జానపాడు, పిడుగురాళ్ల పట్టణ పరిధిలో, దాచేపల్లి పట్టణ సమీప, ముత్యాలంపాడు రోడ్డు, ఏపీ మోడల్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలలో వైసీపీ నేతలు కొందరు బినామీ పేర్లతో లేఅవుట్‌లు విస్తరింపజేశారు.

గుర్తించినవి కొన్నే.. గుర్తించాల్సినవి ఇంకా ఎన్నో..

అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారికి సమీపంలో పిడుగురాళ్ల నుంచి రాష్ట్ర సరిహద్దు అయిన పొందుగల వరకు ఎక్కడ బడితే అక్కడ పంట పొలాలను ప్లాట్లుగా మార్చేశారు. పొలం యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్న రియల్టర్లు ఆ భూమిలో మెరకవేసి ప్లాట్లుగా విభజించి సెంట్లు కొద్దీ భూమిని విక్రయిస్తున్నారు. మెడికల్ కళాశాల సమీపంలో రెవెన్యూ గ్రామమైన కామేపల్లి పరిధిలో కేవలం ల్యాండ్ కన్వర్షన్ పొందినవి కొద్దిగా వున్నప్పటికీ ఇంకా ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు పెట్టుకోకుండా వున్న భూములే ఎక్కువగా వున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అండదండలతో గ్రామ పంచాయతీ అధికారులను కూడా లెక్కజేయకుండా ప్లాట్లను అమ్మేసుకొని సొమ్ము చేసుకున్నారు. దీంతో పంచాయతీలకు, రిజిస్ట్రేషన్ శాఖ పెద్దఎత్తున ఆదాయం కోల్పోయింది. అయినా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు నోరు మెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరైతే పంచాయతీల అనుమతులు ఏమీ లేకుండానే "మాకింత ఇవ్వండి.. మీరేమైనా చేసుకోండి" అంటూ రియల్ ఎస్టేట్‌దారుల నుంచి లంచాలు పుచ్చుకున్నవారు ఉన్నారని సమాచారం. వారంతా నేటికీ అనుమతుల విషయంపై నోరు మెదపకపోవడంతో పాటు ఉన్నతాధికారులనుసైతం తప్పుదారి పట్టిస్తూ మా పరిధిలో అనధికార లేఅవుట్‌లు ఏమీ లేవంటూ చెప్తుండటం కొసమెరుపు.

బ్రాహ్మణపల్లి, కామేపల్లి పరిధిలో సర్వే నెంబరు 169కి ఇంకా అనుమతుల కోసం ఇప్పటికీ దరఖాస్తు చేసుకోలేదు. తుమ్మలచెరువు రెవెన్యూ పరిధిలో 512 సర్వే నెంబరు మాత్రమే ల్యాండ్ కన్వర్షన్ పొందినట్లు అధికారులు ధ్రువీకరిస్తున్నా వాస్తవానికి ఆ గ్రామ పరిధిలో సుమారు 10కి పైగా అనధికార లేఅవుట్‌లు రాష్ట్ర రహదారికి పక్కనే ఉన్నాయి. అవి బాహాటంగా కనిపిస్తున్నా వాటిపై అధికారులు మాత్రం నోరు మెదపటం లేదు. ఇప్పటికీ పిడుగురాళ్ల మున్సిపల్ పరిధిలో అనధికారి లే అవుట్‌లు 32, రూరల్ పరిధిలో 10, దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో 17 అనధికార లేఅవుట్‌లను అధికారులు గుర్తించారు. మాచవరం, గురజాల మండలాల పరిధిలో అనధికార లేఅవుట్‌ల గుర్తింపు ప్రక్రియ ఒకటి, రెండు రోజుల్లో పూర్తి కానున్నది.

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'



గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో.... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనార్టీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956'ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3Y60EZ7లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజనీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్జాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.

హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు



'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేవారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.

ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టిన రోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.



హిందువులేనా అని అడిగారు



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్ళిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికేట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్ల పాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళీ నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య ప్రొడక్షన్ కంట్రోలర్ నోబల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్ధిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. 'చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహించనున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఎండిపోయిన కొచ్చెర్ల మంగలి వారి చెరువు

చేపల కోసం చెరువును ఎండబెట్టారు

● తాగు, సాగు నీటికోసం కొచ్చెర్ల గ్రామస్థుల అవస్థలు

ఈపూరు, ఆగస్టు 26: మండలంలోని కొచ్చెర్ల మంగలవారి చెరువును చేపలు పట్టుకునేందుకు వ్యాపారులు నీటిని బయటకు వదిలి ఎండబెట్టారు. గ్రామానికి తాగు, సాగునీటిని అందిస్తున్న చెరువు ఎండిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశువులకు తాగునీరు లేక సుమారు 5కి.మీ దూరంలో ఉప్పరపాలెం చెరువుకు తోలుకుపోవాల్సి వస్తుందని పశు యజమానులు అంటున్నారు. వందల ఎకరాలలో పంటలను చెరువు నీటితోనే పండిస్తుంటారు. ప్రస్తుతం చెరువులో నీరు లేకపోవడంతో వరినాట్లు వేయలేక పోతున్నామని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు తమస్వార్ధంకోసం చేపల వ్యాపారులకు చెరువు నీటిని బయటకు పంపేందుకు అనుమతి ఇవ్వడం వలనే చెరువు ఎండిపోయిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగర్ కాలువ నీటితో చెరువుని నింపాలని గ్రామస్థులు కోరుచున్నారు.

జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో వాగ్దేవి డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 18, అండర్ 20, అండర్ 23 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాలలో ఆచార్యా నాగార్జున యూనివర్శిటిలో నిర్వహించిన పోటీలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. కే ప్రవీణ్ కుమార్ 400 మీటర్లు పరుగులో ప్రథమ, 200 మీటర్ల పరుగులో ద్వితీయ బహుమతి సాధించారు. కాగా జే యశ్వంత్‌కుమార్ 400 మీటర్లలో ద్వితీయ, ఎస్‌కే అల్మాస్ 400 మీటర్లలో తృతీయ, డీ వీరాంజీ డిస్కస్‌త్రోలో ప్రథమ, షార్ట్‌పుట్‌లో ద్వితీయ, కే ఏసుబాబు 1500మీటర్లలో ప్రథమ, కే ఆదిలక్ష్మి 100 మీటర్లలో ద్వితీయ, డిస్కస్‌త్రోలో ద్వితీయ, వై చిలకమ్మ షాట్‌పుట్‌లో ద్వితీయ, వంద మీటర్లలో తృతీయ బహుమతులు సాధించారు. విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్ అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ చూపిన జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు

వాగ్దేవి జూనియర్ కళాశాల..

కాగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు అన్నారు. అండర్ 18 బాలిక విభాగంలో పీ తిరుపతమ్మ వంద మీటర్ల రన్నింగ్‌లో మొదటి, 1500 మీటర్లలో మొదటిస్థానంలో నిలిచారు. కే శ్రీనిధి 1000 మీటర్ల రన్నింగ్‌లో మొదటి, 100 మీటర్లలో రెండవ, ఎ బాలప్రసన్న లాంగ్ జంప్‌లో ద్వితీయ, 100 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ, కే టోనీగౌరి 1500 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ, ఎస్ వినీల లాంగ్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 20 బాలుర విభాగంలో పీ భాను ప్రకాష్ ట్రిపుల్ జంప్‌లో మొదటి, కే ప్రతాప్ ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం సాధించారు. అండర్ 18 బాలుర విభాగంలో ఆర్ఎల్‌వీఎస్‌బీ శంకర్ 5కే వాక్‌లో ద్వితీయ, జీ సాయి కాశి వెయ్యి మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ, బీ వెంకటేశ్వర్లు వెయి మీటర్ల రన్నింగ్‌లో తృతీయ, బీ మారుతి లాంగ్‌జంప్‌లో ద్వితీయ, పీ అఖిల్ లాంగ్ జంప్‌లో తృతీయ, జీ వెంకట వీరనాని షాట్‌పుట్‌లో ద్వితీయ, బీ వెంకటేశ్వర్లు షాట్‌పుట్‌లో తృతీయస్థానంలో నిలిచారు. విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు పాశం కృష్ణారావు, వీవీ అచ్యుతరావు, కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పీడీ రాయల అంజనేయులు అభినందించారు.

అజయ్ కుమార్‌కు పీహెచ్‌డీ



ఉమ్మనేని అజయ్ కుమార్

రొంపిచర్ల, ఆగస్టు 26: మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన ఉమ్మనేని అజయ్‌కుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రఫెల్, జీఐఎస్ సాంకేతికతలను ఉపయోగించి చేసిన పరిశోధనకు ఈ పట్టా అందుకున్నారు. విశాఖపట్నం జిల్లాలో ఎంపికచేసిన రిజర్వాయర్లలో సంభావ్య నేల కోత, వార్షిక మట్టి నష్టం అంచనా అనే అంశంపై ప్రొఫెసర్ బైరాగిరెడ్డి ఆధ్వర్యంలో అధ్యయనానికి పట్టా పొందాడు. ఆంధ్ర విశ్వ విద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. తన తండ్రి చిన్నప్పుడే చని పోయారు. తల్లి భూలక్ష్మి కష్టపడి ఇరువురు కుమారులను చదివించింది. విజయకుమార్ రెండో కుమారుడు. చిన్న వయస్సులో పట్టాపొందిన అజయ్ కుమార్‌ను గ్రామస్థులు అభినందించారు. ఉత్తమ పరిశోధకుడు, యువ పరిశోధకుడు, పరిశోధనా నైపుణ్యం అవార్డులు వరించాయి.

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే మేలు

● ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ శరత్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) కన్నా పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు మేలు చేస్తుందని ఎస్టీయూ పల్నాడు జిల్లా సీపీఎస్ కన్వీనర్ టీ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్ విధానంలో ఉద్యోగులు ప్రతి నెలా జమచేసిన పెన్షన్ ఫండ్ నుంచి రిటైర్మెంట్ సమయంలో ఎంతశాతాన్ని చెల్లిస్తారో పేర్కొనకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉద్యోగి వద్ద ఎలాంటి కాంట్రిబ్యూషన్ మినహాయించకుండా పెన్షన్ విధానాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయడమే ప్రభుత్వాలకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందన్నారు.

చేపలు పెంచుకునేందుకు వేలం

ఈపూరు, ఆగస్టు 26: మండలంలోని చిట్టాపురం పంచాయతీ పరిధిలో ఊర చెరువులో చేపలు పెంచుకునేందుకు ఈ నెల 29వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ హైమావతి తెలిపారు. 52ఎకరాల విస్తీర్ణం గల చెరువును రెండు సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకు నిర్వహిస్తున్న వేలంలో పాల్గొనదలనవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలను విజయవంతం చేయాలి

చిలకలూరిపేట, ఆగస్టు 26: 1, 2, 3 తేదీలలో విశాఖలో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు సోమవారం కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలకు రూ.10వేలను కాసా రాంబాబు అందజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కపిలవాయి విజయకుమార్ తదితరులు

యడ్లపాడు, ఆగస్టు 26: మండలంలోని పలు ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన చెంఘీజ్‌ఖాన్‌పేట రాజ్యలక్ష్మీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు నవనీత బాలకృష్ణుని నిజరూప దర్శనం గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలను నిర్వహించారు. బాలకృష్ణునితో పాటు ఆలయంలోని దేవతామూర్తులను ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈవో శివయ్య, సహాయకుడు కృష్ణ ప్రసాద్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా మండలంలోని సొలస రంగనాయకస్వామి ఆలయంలో, లింగారావుపాలెం గీతామందిరం, జాలాది, యడ్లపాడు గ్రామాల్లోని కృష్ణ మందిరాల్లో కూడా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండవీడులోని ఇస్కాన్ గోశాలలోని కృష్ణమందిరంలో కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎస్పీ ప్రత్యేక పూజలు

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని చెంఘీజ్‌ఖాన్‌పేటలోని చారిత్రక వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయంలో జరిగిన వేడుకలలో పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి వచ్చిన ఆయన నవనీత బాలకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్పీకి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్ఠతను, చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

● నూజెండ్ల: మండలంలోని దేవాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నూజెండ్ల చెన్న కేశవస్వామి దేవాలయం, గుర్రపునాయుడుపాలెం, సీతారామ చంద్రస్వామి దేవాలయం, రవ్వవరం వెంకటేశ్వర జగన్నాధపీఠం, పాత ఉప్పలపాడు తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బొల్లాపల్లి: కృష్ణాష్టమి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గంగుపల్లి, కండ్రిక, తంగిసీడు పాలెం తదితర గ్రామాలలో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కృష్ణాష్టమి సందర్భంగా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: స్థానిక కేసానుపల్లిలో ఉన్న ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవంలో చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు ఉట్టిగొట్టి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట: స్థానిక ఏఎంరెడ్డి విద్యా సంస్థలలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులకు రంగోలి, కోలాటం, ఉట్టికొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ భూషణ్‌రావు, డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట రాధాగోవిందుని మందిరంలో సోమవారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీమద్‌భాగవత ప్రవచనం, మహా హరినామ సంకీర్తన చేశారు. రాధా గోవిందులకు ప్రత్యేక అలంకరణ జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇస్కాన్‌లోని రాధాగోవిందులను దర్శించుకున్నారు. ఆయన వెంట రామకృష్ణ కొండలరావు బహదూర్, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ తదితరులు ఉన్నారు. ఎస్పీ కే శ్రీనివాసరావు రాధా గోవిందులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, దద్దనాల మిట్ట, కొనకంచివారి పాలెం, అచ్చయ్యపాలెం, ఎడ్వర్డుపేట గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● కనమర్లపూడి (శావల్యాపురం): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలోని కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు శ్రీకృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలు ధరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఉట్టిని కట్టి ఆనందోత్సాహాలతో చిన్నారులతో ఉట్టిని కొట్టించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగసురేష్ పాల్గొని శ్రీకృష్ణుని జన్మవృత్తాంతను వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో క్యాంపస్ మేనేజర్ బాబు, పీఈటీ వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణంలోని గీతాంజలి లీడ్ ఏసీ పాఠశాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉట్టికొట్టే ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వై.శేషగిరిరావు, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, పాఠశాల కరస్పాండెంట్ వై.ఎల్. కిషోర్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. గాంధీపేటలో యాదవ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పందిరివేసి శ్రీకృష్ణుడు విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ ఊరేగింపు జరిపారు. మాజీ కౌన్సిలర్ గాలం కోటి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 8వ వార్డులో వినాయకుడి గుడి పక్క వీధిలో కూడా భారీఎత్తున వేడుకలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సాయి గణేష్ అపార్ట్ మెంట్ వద్ద కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చైతన్య లిటిల్ స్కూల్లో కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు రాధాకృష్ణ చిత్రపటాన్ని ఆయన అనుచరులు లింగాల విజయ్‌యాదవ్, ఈశ్వరరెడ్డి, ఊసా శ్రీహరి బహూకరించారు.

● వినుకొండ టౌన్, ఆగస్టు 27: పట్టణంలోని మెయిన్ బజార్‌లోని వివేకానంద హైస్కూల్ ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సయ్యద్ అరీఫ్ పండుగల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అంజి, షకీరా తదితరులు పాల్గొన్నారు. సీతయ్య నగర్ విజేత కాన్సెప్ట్ పాఠశాల్లో కృష్ణామి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఆవులమంద బ్రహ్మయ్య, కరస్పాండెంట్ కావూరి సాయి పాల్గొని అభినందించారు.

● వినుకొండ: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీదత్త వెంకటేశ్వర మహిళల కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవాలయం ధర్మకర్త కనపర్తి వెంకట్రావు, సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

● నూజెండ్ల: మండలంలో డాక్టర్ లక్ష్మయ్య యూపీ స్కూల్‌లో జరిగిన వేడుకలలో డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొని కృష్ణాష్టమి గురించి వివరించారు.



ప్రత్యేక అలంకరణలో చెంఘీజ్‌ఖాన్‌పేట వెన్నముద్దల వేణుగోపాలస్వామి ఆలయంలోని నవనీత బాలకృష్ణుడు, బాలకృష్ణుని దర్శించుకున్న ఎస్పీ శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు

మదర్ థెరిస్సాకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: నరసరావుపేట పట్టణంలో సోమవారం సెయింట్ మదర్ థెరిస్సా 114వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పల్నాడు రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళి అర్పించారు. మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శం అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమానికి తెలుగు సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ గోదా రమేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. మదర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు 200మందికి అల్పాహారం అందించారు. సింగరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు, బాలింతలు 100మందికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్‌థెరిస్సా విగ్రహనిర్మాణ కమిటీసభ్యుడు రాయల శ్రీనివాసరావు, మిట్టపల్లి రమేష్, గర్నెపూడి అలెగ్జాండర్, పాదర్తి ప్రసాద్, భాగవతుల లక్ష్మీనారాయణ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్, వంకాయలపాటి రవి, కొట్టా కిరణ్‌కుమార్, క్రాంతి, గుత్తా అంకమ్మచౌదరి, జనసేన నాయకుడు వీరవల్లి వంశీ, నార్ల మారుతిబాబు, పిడతల రమాదేవి, అమ్మా జిలానీ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ఎల్‌బీ మార్కెట్ వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి జనసేన ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించి, ఘనంగా 114వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి ఆనంద్, మిరియాల వెంకట సుబ్బమ్మ, శ్రీకాంత్ గుప్తా, కిష్టంశెట్టి గోవింద్, గోపు మల్లి, చెన్నుపల్లి సాంబశివరావు, ఆర్‌కే యాదవ్, ఎస్‌డీ గౌస్, జక్కం నిర్మల, జడ శ్రావణి, ఝాన్సీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా స్థానిక యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న సాయి ప్రశాంతి వృద్ధుల ఆశ్రమానికి సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం జిల్లా ప్రతినిధి చుక్కా విన్సెంట్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్సీఎం చర్చిఫాదర్ మరియదాసు పాల్గొని ప్రార్థన చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామమోహన్, లోక్‌సత్తా పార్టీ నేత మాదాసు భానుప్రసాద్, వడ్లన బుజ్జిబాబు, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో సోమవారం చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామములోని కస్తూరిబా బాలికల హైస్కూల్ లో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మ్యాక్స్ విజన్ విజయవాడ వారి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమములో వారణాసి శరత్ కుమార్, కొల్లా వెంకట సుబ్బారావు, డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, పోలిశెట్టి రాఘవయ్య, అలంగార్ మోహన్ పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గుమ్మడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మదర్ థెరిస్సా చేసిన సేవలను కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణానాయక్

గాటితండాలో జ్వరాలపై వైద్యశిబిరం

బొల్లాపల్లి, ఆగస్టు 26: మండలంలోని గాటితండాలో విషజ్వరాల బారినపడి ప్రజలు మంచంపట్టారు. గ్రామానికి చెందిన టీఆర్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మూలావత్ రవినాయక్, మండల ప్రత్యేకాధికారి రవిబాబు విషయాన్ని కలెక్టర్ అరుణ్‌బాబుకు దృష్టికి తీసుకెళ్ళడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. జ్వరాలు అదుపులోకి వచ్చేవరకు మూడ్రోజులపాటు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందని డాక్టర్ కృష్ణానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దుర్గాబాయి, సిబ్బంది పాల్గొన్నారు.



మహేశ్వరరావును సన్మానిస్తున్న తెలుగు వెలుగు సంక్షేమ సంఘం ప్రతినిధులు

నరసరావుపేట దర్జీకి తమిళనాడులో సత్కారం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26: నరసరావుపేటకు చెందిన దర్జీకి తమిళనాడు రాష్ట్రంలోని పెరంబదూరులో సత్కారం జరిగింది. వివరాలలోకి వెళితే నరసరావుపేటలో దర్జీగా జీవనం సాగిస్తున్న ఎస్.మహేశ్వరరావు వేమన పద్యాలు వేలకొద్ది అలవోకగా భావయుక్తంగా ఆలపించి వివరించటంలో దిట్ట. పాఠశాల స్థాయిలో మాత్రమే చదవు ఉన్న మహేశ్వరరావు పట్టణంలో వేమన మహేష్‌గా ప్రసిద్ధికెక్కారు. ఈ నేపథ్యంలో తమిళనాడు పెరంబదూరులోని అగరంలో తెలుగు వెలుగు సంక్షేమ సంఘం దూంధాం తెలుగు భాషా సంబరాలు సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్వరరావును డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ముక్కా ల నమ్మాళ్వార్ శ్రేష్ఠిగారి ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. మహేశ్వరరావును పలువురు సాహితీ ప్రియులు, ప్రముఖులు, స్నేహితులు అభినందించారు.

ద్విచక్రవాహనం చోరీ

శావల్యాపురం, ఆగస్టు 26: రోడ్డుపై నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేసిన సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెవల వెంకటేశ్వర్లు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో సొసైటీ కార్యాలయం ఎదురు బజారులో నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి హీరో హోండా స్పెండర్ బైకును ఇంటి ముందున్న రోడ్డుపై పార్క్ చేశాడు. సోమవారం ఉదయాన్నే పొలానికి వెళ్ళేందుకు బయటకొచ్చి చూసేసరికి బైకు లేకపోవడంతో ఇరుగుపొరుగువారిని ఆరాతీసినా ఆచూకీ తెలియలేదు. దాంతో బైకు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.